క్లుప్తంగా

చర్యలు తీసుకోండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరుతూ మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు తమ పరిష్కరించాలని సమ్మె చేస్తుండటంతో వారి సమస్యలను పరిష్కరించకుండా అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టడం ఏమిటని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు, డబ్బులు, ఆట వస్తువులు, కిరాణా సామాన్లు ఉన్నాయన్నారు. తాళాలు పగలగొట్టినవారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కల్పన, విజయ, కృష్ణవేణి, మధుబాల, పద్మ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

జిన్నారం(పటాన్‌చెరు): వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మహిళా సఫాయి మిత్రలకు ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బంది, అంగన్‌వాడీ, మెప్మా రీసోర్స్ పర్సన్‌లకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం రోజారాణి మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆర్ఓ శ్రీధర్, వైద్యురాలు రాధిక పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నారాయణఖేడ్: స్వచ్ఛత లీగ్ స్వచ్ఛతకి హాయ్ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై ఖేడ్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 10వ తరగతికి చెందిన పి.శ్వేత మొదటి బహుమతి, రెండో బహుమతి పి.సర్వేశ్వర్ కుమార్, మూడో బహుమతిని హరినాథ్‌గౌడ్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వారికి పారిశుద్ధ్య నిర్వహణ అధికారి శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈత చెట్ల పెంపకానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్: ఈత చెట్ల పెంపకానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ కోరారు. ఈత, తాటిచెట్ల పెంపకం కోసం బోరపట్ల గ్రామ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘానికి మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఇచ్చారని, అందులో కల్లుగీత కార్మికులు ఈత మొక్కలు నాటారన్నారు. బోర్ వేయించి విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేస్తే ఉచిత విద్యుత్ మీటర్ ఇవ్వకుండా కమర్షియల్ విద్యుత్ మీటర్ ఇచ్చారని వాపోయారు. దీంతో నెలకు రూ.4 వేల నుంచి 5వేలు బిల్లు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఉచిత విద్యుత్ అందజేసి కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

కంది(సంగారెడ్డి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. కందిలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అదేవిధంగా చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

కంగ్టి(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన ఘటన తడ్కల్ మండలంలోని ముర్కుంజాల్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు కిందకి వేలాడుతుండడంతో నీరు తాగేందుకు వెళ్లిన మేక అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు కుర్మ లాలు ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడంలేదని సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి వాపోయారు.

గణేష్ గడ్డ జాతరకు ఏర్పాట్లు పూర్తి

పటాన్‌చెరు టౌన్: రుద్రారం గ్రామ సమీపంలో కొలువైన గణేష్ గడ్డ దేవస్థానం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించినట్టు అర్చకులు తెలిపారు. వివిధ రకాల పుష్పాలతో గణనాథుని అలంకరించారు. గణేష్ గడ్డ ఉత్సవాలలో భాగంగా చివరి రోజు గురువారం జరగనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈవో మోహన్ రెడ్డి, సర్పంచ్ సుధీర్ రెడ్డి తెలిపారు.



గోడపై హెచ్చరిక రాసిన చోటే పడిఉన్న చెత్త

'చెత్త' మనుషులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత. ఎంత శుభ్రత పాటిస్తే అందరికీ అంత ఆరోగ్యం. ప్రజల ఆరోగ్యం కోసం అధికారులు, పారిశుధ్య కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారు. కాని కొందరు ప్రజలు మాత్రం అది తమ బాధ్యత కానట్టే వ్యవహరిస్తున్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని కేబీఆర్ కాలనీలో జరిగింది సరిగ్గా అదే.. ఇక్కడ చెత్త వేయరాదు వేసినచో రూ.వెయ్యి జరిమానా అని మున్సిపల్ అధికారులు హెచ్చరిక రాశారు. కొందరు సరిగ్గా అక్కడే చెత్తను పడవేశారు. ప్రజలు కూడా బాధ్యతగా ఉంటే స్వచ్ఛతా కార్యక్రమాలు విజయవంతమవుతాయి. అయితే నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు కచ్చితంగా తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– జిన్నారం (పటాన్‌చెరు)

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

జిల్లావ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 128వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెత్తందారుల వ్యవస్థకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


రామచంద్రాపురం: సండే మార్కెట్‌లో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


నారాయణఖేడ్: ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


జిన్నారం: కానుకుంటలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు


పటాన్‌చెరు టౌన్: చిట్కుల్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్


ఝరాసంగం: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ దేవదాసు, నాయకులు


పటాన్‌చెరు: ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి


సదాశివపేట పట్టణంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

రాష్ట్ర చేనేత సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర చేనేత సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని నందికంది గ్రామంలో రూ.7లక్షల నిధులతో నిర్మించనున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డుల నిర్మాణాలు చేపట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎంపీటీసీ సునీత, రైతుబంధు అధ్యక్షుడు అమరేందర్‌డ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, తదితరులు నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

సదాశివపేట(సంగారెడ్డి): వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న దడువాయిల సమస్యలను మంత్రి హరీశ్‌రావుకు విన్నవించి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. అనంతరం చింతా ప్రభాకర్‌ను దడువాయిలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దడువాయిల సంఘం అధ్యక్షుడు కొనాపురం ప్రభు, నాయకులు దశరథ్, శ్రీనివాస్, రాచన్న, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే మాణిక్‌రావు గెలుపు

డీసీఎంఎస్ చైర్మన్, ఎన్నికల ఇన్‌చార్జి శివకుమార్


చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్‌రావు గెలుపునకు నాయకులందరూ ఐక్యంగా కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల ఇన్‌చార్జి దేవిప్రసాద్ పిలుపునిచ్చారు. న్యాల్‌కల్ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో మంగళవారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ సభ్యుడు తన్వీర్ అహ్మద్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రశేఖర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. గ్రామాల్లో ఇంకేమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు తాము, ఎమ్మెల్యే కలసి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ గతంలో తనను భారీ మెజార్టీతో గెలిపించారని ఈసారి కూడా అదే మెజార్టీతో గెలిపించి సేవచేసే అవకాశాన్ని కల్పించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. సమావేశంలో ఎంపీపీ అంజమ్మ, ఉపాధ్యక్షుడు గౌసోద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు


వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


మండప నిర్వాహకులతో చింతా ప్రభాకర్

హత్నూర (సంగారెడ్డి): హత్నూర పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ వీరస్వామిగౌడ్, మెదక్ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్‌కు సన్మానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలోని శాంతినగర్‌లో కౌన్సిలర్ నక్క మంజులత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, మాజీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, నాయకులు నాగరాజ్‌గౌడ్, పవన్, ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో మెలగాలి

సదాశివపేట(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ ఐకమత్యంతో మెలగాలని మనబిన్ ఫౌండేషన్ చైర్మన్ ప్రముఖ న్యాయవాది ముఖీం అన్నారు. మంగళవారం సదాశివపేట పట్టణంలోని గొల్లకేరి, హరిజనవాడ, పంచముఖి హనుమాన్ దేవాలయాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సమాజం సభ్యులు కొత్తగొల్ల సత్తయ్యయాదవ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

నారాయణఖేడ్: ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్‌ను ప్రవేశపెట్టి పేదలకు భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు పరమేశ్వర్, కోఆప్షన్ నవాబ్, నాయకులు విఠల్‌రావు, మల్గొండ, లక్ష్మణ్‌రావు, దత్తుపటేల్ పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామానికి చెందిన సులోచన, గంపల వీరమణి, బొల్లారం ఎల్లాదాసుకు మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీపీ వావిలాల నరసింహులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కిషోర్, వార్డుసభ్యులు వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు

వట్‌పల్లి(అందోల్): గ్రామాలలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అన్ని గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తుందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ చెప్పారు. జోగిపేట ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఖోఖో, అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని మినీ స్టేడియంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, మండల విద్యాధికారి బి.కృష్ణ, పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల మానయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కాంగ్రెస్ మద్దతు

ఝరాసంగం(జహీరాబాద్): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్ డిమాండ్ చేశారు. మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతరావు పాటిల్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మండల ప్రజా పరిషత్ తరపున తీర్మానం చేస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.25 వేలు, ఆశావర్కర్లకు 18వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవదాసు, వైస్ఎంపీపీ మల్లన్నపాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్‌పాటిల్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ముల్తాని, నాయకులు సంగ్రామ్ పాటిల్, సంగన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **చేపపిల్లల విడుదల**

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రంలోని చెరువులో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేపపిల్లలను మంగళవారం వదిలారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, ప్యాక్స్ డైరెక్టర్ మహేశ్‌బాబు, ముదిరాజ్ సంఘం నాయకులు మన్నె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పరిహారం అందించాలని విన్నపం**

నారాయణఖేడ్: మండల పరిధిలోని పంచగామ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలతో ఇళ్లు కూలిపోయిన బాధితులు ఉసిరికపల్లి రాజు, ఉసిరికపల్లి కృష్ణ తదితరులు పరిహారం అందజేయాలని కోరారు. రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించి రెండు నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. కలెక్టర్ చొరవ చూపి పరిహారం ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

◆ **అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, ముంగి ఎంపీటీసీ విజయలక్ష్మి కలిసి రూ.50వేల విరాళం అందజేశారు. టేకూర్, మిర్జాపూర్(ఎన్), రుక్మాపూర్ సర్పంచ్‌లు అమేర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి**

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఆక్సిస్ బ్యాంక్ సమీపంలో రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ వర్క్ఇన్‌స్పెక్టర్ మహేష్, సెక్షన్ ఆఫీసర్ మధు తదితరులు ఉన్నారు.

◆ **ఘనంగా మహోత్సవాలు**

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో మల్లికార్జునస్వామి పల్లకీ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు సంగారెడ్డి జిల్లాతో పాటు కర్నాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు హాజరై పల్లకీ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

◆ **అవకతవకలపై విచారణ జరిపించాలి**

సంగారెడ్డి అర్బన్: కంది మండల పరిధిలోని అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఫ్యాకల్టీ అవకతవకలపై విచారణ జరిపించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2న గెస్ట్ ఫ్యాకల్టీ కాంటాక్ట్ ఉద్యోగాలను సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ చెందిన వ్యక్తులకు ఇచ్చారన్నారు. దీంతో విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ రాజు, తార కళాశాల అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థుల ఖర్చులను ప్రభుత్వమే భరించాలి**

నారాయణఖేడ్: ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పరీక్షలకు ప్రిపేర్ అవుతూ గ్రూప్-1 పరీక్షలు రద్దు కావడంతో తీవ్రంగా నష్టపోతున్నారని, దీంతో వారికి కోచింగ్, మెటీరియల్స్ ఖర్చును ప్రభుత్వం భరించాలని ఎన్‌యూఐ నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా పరీక్షలు రద్దు చేస్తూ అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడోద్దని హెచ్చరించారు.

◆ **పనుల పరిశీలన**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదలలో నిరుపేదలకు అందించనున్న స్థలాన్ని చదును చేస్తున్న పనులను మంగళవారం సర్పంచ్ నర్సింహరెడ్డి పరిశీలించారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలను త్వరలోనే అందిస్తామని తెలిపారు.

◆ **రైతుబీమా చెక్కు అందజేత**

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని బడంపేట గ్రామానికి చెందిన రైతు సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రైతుబీమా చెక్కును సర్పంచ్ శ్వేతాబుచ్చిరెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవంతి, నాయకులు నర్సింహులు, రామిరెడ్డి, ప్రభురెడ్డి, నవీన్‌గౌడ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ **అగ్నివీర్ సైనికులుగా ఎంపిక**

వట్‌పల్లి(అందోల్): అందోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు, ఎన్‌సీసీ కేడేట్లు శ్రీకాంత్, లక్ష్మీనారాయణలు అగ్నివీర్ ఇండియన్ ఆర్మీ సైనికులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవిదాస్, ఎన్‌సీసీ అధికారి మాణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, కొండల్ అభినందించారు.

◆ **అమరుల స్తూపానికి మట్టి సేకరణ**

సంగారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంజీరా బ్యారేజ్ సబ్ పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కల్పగూర్ గ్రామంలో మట్టి సేకరించారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాస్‌గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి భిక్షపతి, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు జగదీష్, తపాల సిబ్బంది శివ, బిందు, రాజు పాల్గొన్నారు.

◆ **గంజాయి సేవించిన వారిపై చర్యలు**

మునిపల్లి(అందోల్): వినాయక నిమజ్జనంలో భాగంగా గంజాయి సేవించి చిందులు వేసిన వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ మధుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గంజాయి సాగు చేసినా, విక్రయించినా, సేవించినట్లు ఆధారాలు దొరికితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా కొంతమంది గంజాయి సేవిస్తున్నట్లు తెలిసిందని తెలిపారు.

ఘనంగా బీఎంఎస్ జిల్లా మహాసభలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా మహాసభలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు మల్లేశం, మోహనరెడ్డి, నరసింహారెడ్డి, ఎన్‌రెడ్డి, గణపతి, అంజయ్య, యాదగిరి పాల్గొన్నారు.

◆ **వినాయక మండపంలో లడ్డూ చోరీ**

జహీరాబాద్ టౌన్: రాచన్నపేట గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఇద్దరు దొంగలు మోటారు బైక్‌పై వచ్చి మండపంలోకి చొరబడ్డారు. అడ్డంగా ఉంచిన కుర్చీలు, బల్లలను పక్కకు జరిపి లోపలికి ప్రవేశించారు. విలువైన వస్తువులు ఏమీ దొరకకపోవడంతో స్వామివారి లడ్డూ ఎత్తుకెళ్లారు. సీసీ టీవీలో చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. గణేష్ మండప నిర్వాహకులు జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపడుతున్నారు.